క్లుప్తంగా

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

అశ్వారావుపేటరూరల్: నేరాలు నియంత్రణపై దృష్టి పెట్టాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో అధికంగా నేరాలు, అక్రమ రవాణాలు, చోరీలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకుని పెట్రోలింగ్‌ను క్రమంగా తప్పకుండా నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కొద్ది రోజుల క్రితం నమోదైన ఓ అట్రాసిటీ కేసుపై విచారణ చేశారు. కార్యక్రమంలో సీఐ కరుణాకర్, ఎస్సైలు పి.శ్రీకాంత్, శివరామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం కాలనీ గ్రామంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కొంతమంది బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు కలిసి ధర్నా చేపట్టారు. నారాయణపురం కాలనీ వద్ద అశ్వారావుపేట–వేలేరుపాడు ప్రధాన రహదారిపై దాదాపు గంటపాటు బైఠాయించగా.. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణపురం కాలనీ, నాయకులగూడెం, ఎరుకుల గూడేల్లో సీసీ రోడ్లు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. సంక్షేమ పథకాలు కూడా అందడం లేదని అవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మెచ్చా ఆందోళన చేస్తున్న కాలనీ వాసులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

క్యాబినెట్‌లో చర్చేది?

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ముంపుపై సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో చర్చించకపోవడం దారుణమని సీపీఎం భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. గోదావరి ఉధృతి సమయంలో జిల్లా మంత్రిని, అధికారులను ఎలెర్ట్ చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్.. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో భద్రాచలం ముంపు పరిణామాలపై చర్చించకపోవడం బాధాకరం అన్నారు. పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి ముంపుపైనా దృష్టి సారించాలని కోరారు.

ఇంటింటికీ మేనిఫెస్టో

ములకలపల్లి: యూత్ కాంగ్రెస్ అశ్వారావుపేట నియోజకవర్గ సమావేశం ములకలపల్లిలో మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు కోరంపల్లి చెన్నారావు అధ్యక్షతన నిర్వహించిన యూత్ జోడో–బూత్ జోడో కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్, వరంగల్ డిక్లరేషన్, కాంగ్రెస్ మేనిఫెస్టోను విస్తరంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేశారు. జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్., షేక్ అబీద్, అశ్వారావుపేట అసెంబ్లీ యూత్ జోడో ఇంచార్జ్ సూరిరెడ్డి, నియోజకవర్గ వైస్‌ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్, జహీర్, గుంపుల రవితేజ, చిడిపి భాను. పాలకుర్తి రవి. గాదెగోని వెంకటేశ్, కుంజా వెంకట్ పాల్గొన్నారు.

పట్టాలు ఇప్పించాలి

భద్రాచలం: అశ్వారావుపేట నియోజకవర్గంలో ఆగిపోయిన ఆరు గ్రామాలకు చెందిన గిరిజనుల పోడు భూముల పాస్ పుస్తకాలను తిరిగి అందే విధంగా చర్యలు తీసుకోవాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఐటీడీఏలోని పీవో చాంబర్‌లో పీవో ప్రతీక్ జైన్‌ను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.పీవో సానుకూలంగా స్పందించారు. దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, ఎర్ర వసంత్ రావు, పమార్తి వెంకటేశ్వరరావు, మొండివర్రె ఎంపీటీసీ శివ, సోడెం గంగరాజు, దొడ్డ ప్రసాద్, గండుగులపల్లి ఉప సర్పంచ్ శాంతి, పాలకుర్తి ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపిక

దమ్మపేట: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక ప్రక్రియను దమ్మపేటలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు హాజరవగా.. అథ్లెటిక్స్ పోటీలను ప్రిన్సిపాల్ గణ్యా నాయక్, ఎస్సై రవికుమార్‌లు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహీధర్, కోచ్‌లు నాగేందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యం

చంద్రుగొండ: అశ్వారావుపేట నియోజకవర్గంలో అధిష్టానం అభ్యర్థిగా ఎవరిని నిర్ణయించినా కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని టీపీసీసీ సభ్యురాలు వగ్గెల పూజ అన్నారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించి.. ఆ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. తొలుత కార్యకర్తలను కలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సర్పంచ్ దారావత్ పార్వతి, ఎస్‌కె.జాకీర్, మచ్చా కుమార్, మల్లం కృష్ణయ్య, యాకుబ్‌అలీ బుజ్జి పాల్గొన్నారు.

సిలిండర్లు అమ్మబడును!

- కిరాణా దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయం
- అధిక ధరలతో లాభార్జన
- నివాస గృహాల్లే గోదాములు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులు





ఓ దుకాణం ఎదుట ఉన్న గ్యాస్ సిలిండర్..

అన్నపురెడ్డిపల్లి: మండలంలో గ్యాస్‌సిలిండర్‌ల అక్రమ దందా జోరుగా సాగుతోంది. మండల కేంద్రమైన అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంట గ్రామాల్లో కొంత మంది వ్యాపారులు బ్లాక్‌లో గ్యాస్ సిలిండర్ల అమ్మకాలు చేస్తున్నారు. గ్రామాల్లోని కిరాణా దుకాణాల ఎదుట బహిరంగంగానే అనుమతులు లేకుండా గ్యాస్‌ను విక్రయిస్తున్నారు. ఎటువంటి జాగ్రత్తలూ తీసుకోకుండ వ్యాపారులు గ్యాస్‌ను విక్రయించడంపై గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అనుకోని ప్రమాదం సంభవిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని ప్రజలు వాపోతున్నారు.

నిరక్షరాస్యుల పేరిట బుకింగ్..

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రానికి చంద్రుగొండ, సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి వివిధ రకాల కంపెనీల గ్యాస్‌సిలిండర్లను డీలర్లు సప్లయ్ చేస్తున్నారు. డీలర్ల వద్ద నుంచి కొంత మంది వ్యాపారులు ఎక్కువ సంఖ్యలో గ్యాస్ సిలిండర్‌లను కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో కొంతమంది నిరక్ష్యరాసులు కావడంతో వారికి గ్యాస్ బుక్ చేసుకోవడం తెలియదు. దీనితో వారి గ్యాస్‌బుకింగ్ పుస్తకాలు ఈ వ్యాపారులు తీసుకుని అధిక సంఖ్యలో గ్యాస్ సిలిండర్‌లను బుక్ చేసుకుంటున్నారు. దీంతో ఎక్కువ సంఖ్యలో గ్యాస్‌సిలిండర్‌లను వ్యాపారుల సొంతమవుతున్నాయి. ఆపై వాటిని బ్లాక్‌లో అమ్మకానికి పెడుతున్నారు.

అధిక ధరలకు విక్రయం..

ప్రభుత్వం గ్యాస్‌సిలిండర్ ధర రూ.1142కు వినియోగాదారులకు అందిసోంది. అయితే వ్యాపారులు బ్లాక్‌లో వీటిని అమ్ముతూ రూ.1300 వసూలు చేస్తున్నారు. అసలే పెరిగిన ధరలతో సతమతమౌతున్న ప్రజలకు ఈ రకమైన అమ్మకాలు గుదిబండలా మారాయి.

జనావాసాల్లో నిలువ..

అధిక సంఖ్యల్లో గ్యాస్ సిలిండర్‌లను వ్యాపారులు అక్రమంగా ఇళ్లలో నిలువ ఉంచుతున్నారు. జనావాసాల మధ్య ఉంచడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్యాస్ సిలిండర్‌లను సరైన భద్రత ప్రమాణాలు పాటించకుండా నిలువ ఉంచడం ప్రమాదకరం.

పట్టించుకోని అధికారులు..

మండల కేంద్రమైన అన్నపురెడ్డిపల్లిలో దుకాణాల ఎదుట గ్యాస్ సిలిండర్‌లను ఉంచి అమ్మకాలు జరుపుతున్నప్పటికీ రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రధాన రహదారి పైన ఉన్న దుకాణాల ఎదుట గ్యాస్ సిలిండర్‌ను ఉంచి వ్యాపారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదు. ప్రమాదకరమైన గ్యాస్ సిలిండర్‌ను అనుమతులు లేకుండా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం..

అనుమతులు లేకుండా గ్యాస్ సిలిండర్‌లను విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తాం. త్వరలోనే తనిఖీ టీంలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. అనుమతులు లేకుండా గ్యాస్ సిలిండర్‌లు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ, సివిల్ సప్లయీస్ డీటీ

చర్యలు తీసుకుంటాం

గ్యాస్ సిలిండర్లను అక్రమంగా విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. ఈ విషయం ఇంతవరకు మా దృష్టికి రాలేదు. బహిరంగ ప్రదేశాలలో గ్యాస్ సిలిండర్ విక్రయించడం నేరం. అనుమతులు లేని వారిపై చర్యలు చేపడతాం.

– భద్రకాళి, తహసీల్దార్, అన్నపురెడ్డిపల్లి

124 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరురూరల్: గడిచిన జూలైలో సింగరేణి మణుగూరు ఏరియాలో 124శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియాకు 7,76,500 టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 10,46,500 టన్నుల ఉత్పత్తి నమోదైందని చెప్పారు. అలాగే, 10.46 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, వీరభద్రరావు, రమేష్, వెంకట్రావు, మేరికుమారి, అనురాధ, బాబుల్‌రాజ్, ఎస్.శ్రీనివాస్, షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం రామచందర్

విద్యార్థినికి ఆర్థికసాయం

దుమ్ముగూడెం: మండలంలోని కాటాయిగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కొర్సా లక్ష్మికి పలువురు ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. స్థానిక కొర్సా శాంతమ్మ, కన్నయ్యల కుమార్తె లక్ష్మి ట్రిపుల్ ఈ విభాగంలో పాట్నా యూనివర్సిటీలో సీట్ సాధించింది. అక్కడి చదువులకు సంబంధించి దాతల సాయం కోసం ఎదురు చూడగా.. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ, రేలా కార్యదర్శి కొండూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో రూ.54వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే హెల్పింగ్ ఫ్రెండ్స్ కేటీపీఎస్ పాల్వంచ టీం నుంచి యం.రమేష్ రూ.5వేలు విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏపీ కార్యదర్శి బంగారు వెంకటేష్, తెల్లం నవీన్‌కుమార్, భద్రాద్రి జిల్లా నాయకులు ఉమ్మల దుర్గారెడ్డి, స్థానిక టీచర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే దుమ్ముగూడెం గ్రామంలో సీఎస్‌ఐ పాఠశాల పునర్నిర్మాణం చేసిన పూర్వ విద్యార్థులు యామన షన్ముఖరావు, సూర్యప్రకాష్, కరెళ్ళ రాధాకృష్ణ, సిరసాని దుర్గారావు, బైరెడ్డి రాధిక, సౌజన్య, తిరుమలదేవి, లగడపాటి రమేష్, కందుకూరి గణేష్‌ల సహకరంతో రూ.25వేలు బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి యండి.జానీపాషా చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏపీ కార్యదర్శి బంగారు వెంకటేష్, తెల్లం నవీన్‌కుమార్ టీఎస్ భద్రాద్రి జిల్లా నాయకులు ఉమ్మల దుర్గారెడ్డి, స్థానిక టీచర్ రత్నాకర్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, గ్రామ పెద్దలు కొత్తూర సీతారామారావు, కెల్లా శేకర్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమావేశం

దమ్మపేట: మండల కేంద్రంలో గ్రామీణ వైద్యుల ముఖ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ వైద్యుడు మణిదీప్ మాట్లాడుతూ... గ్రామీణ వైద్యులు నిబంధనలకు లోబడి మాత్రమే వైద్యం చేయాలని సూచించారు. ప్రాథమిక చికిత్సలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిమితులను తెలిపారు. ల్యాబ్ టెస్టులను స్వంతంగా ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించకూడదని, ఎక్కువ మోతాదులో యాంటీబయాటిక్స్ తదితర మందులను ఇవ్వకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రామారావు, గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు మహ్మద్ వహబ్, తాండవ కృష్ణ, గోపి, పృథ్వీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్యశిబిరం



చంద్రుగొండ: వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ తనుజ

చంద్రుగొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ కనకం తనుజా సూచించారు. మండలంలోని పోకలగూడెం గ్రామంలో జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది యండి.ఇమాం, రమ్యశ్రీ, శ్రీను, సునిత రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్, నారాయణపురం కాలనీ, రామన్నగూడెం గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ముందుగా పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన డిగ్రీ మహిళా కళాశాలలో నిర్వహించి శిబిరంలో గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యురాలు మధుళిక ఆధ్వర్యంలో 65 మంది విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఐదుగురు జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. అలాగే మండలంలోని నారాయణపురం కాలనీ, రామన్నగూడెం గ్రామాల్లో వేర్వేరుగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 78 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 14మంది జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించి మలేరియా పరీక్షలు చేసి వైద్యం అందించారు. శిబిరాల్లో సర్పంచ్ కంగాల పరమేష్, సిబ్బంది దుర్గమ్మ, భాస్కర్, ఏఎన్‌ఎంలు శాంతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మణుగూరురూరల్: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన చినరాయిగూడెం, కమలాపురం, అన్నారం గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆయా గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం పలు నీటి నిల్వ ప్రాంతాల్లో యాంటి లార్వా చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనీశ, డాక్టర్ అనూష, ఎస్‌యూఓ లింగ్యానాయక్, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, వెన్నెల, వెంకటలక్ష్మి, జయమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు

అశ్వాపురం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబును రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. రేషన్ డీలర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజయ్య, కృష్ణమూర్తి, చంద్రం, అంజయ్య, శ్రావణ్, మనీష్‌కుమార్, అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు మృతికి నివాళి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు దండి మల్లయ్య గుండె పోటుతో మృతి చెందగా మంగళవారం మొండికుంటలో మల్లయ్య మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుక్కారి బ్రహ్మయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నందిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేది వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం సర్పంచ్ వూకే వీరాస్వామి మాట్లాడుతూ.. తల్లిపాలు ఎంతో శ్రేయస్కారమని, తల్లిపాలలో ఉండే పోషకాలే బిడ్డకు ఆరోగ్యమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అలివేలు, అంగన్‌వాడీ టీచర్లు జోగమ్మ, నాగమణి, జ్యోతి పాల్గొన్నారు.

అవినీతిని బట్టబయలు చేస్తాం

బూర్గంపాడు: అధికార బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధుల, నాయకుల అవినీతిని సమయం వచ్చినప్పుడు బట్టబయలు చేస్తామని కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకురాలు, సర్పంచ్ పాలెబోయిన శ్రీవాణి అన్నారు. సంజీవరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఓనమాలు నేర్వనప్పుడే తమది రాజకీయ కుటుంబమన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి అధికార దాహంతో పార్టీ మారిన రేగా నేడు కాంగ్రెస్‌ను విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అభివృద్ధి పేరుతో అడ్డగోలుగా ప్రజాధనం దోచుకుంటున్నారని ఆమె విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, గట్ల శ్రీనివాసరెడ్డి, మందా నాగరాజు, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, రమణ, రాములు, శేఖర్, శివ, దూపూడి శ్రీనివాస్, మోహన్, రాజశేఖర్, గౌరిశంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



దమ్మపేట: ఎమ్మెల్యే మెచ్చాకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

భద్రాచలంఅర్బన్: తెలంగాణా రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు 48 ఏళ్లుగా గౌరవ వేతనంతోనే పని చేస్తున్నారని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే వీరయ్య రానున్న అసంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి సమస్యను వివరిస్తానని, పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపినట్లు ఏఐటీయూసీ నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, నాయకులు సోముల రాంరెడ్డి, విశ్వనాథం, శివాజీ, పూనెం నర్సమ్మ, సాధనపల్లి చిన్నారి, హేమలత, వేదబాయ్, చెల్లాయిపాప, నర్సమ్మ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, దమ్మపేట మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యే మెచ్చాను మర్యాదపూర్వకంగా కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రితో మాట్లాడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నరాటి ప్రసాద్, శివకృష్ణ, ధర్మ, అంగన్‌వాడీలు, విజయ, భారతి, రమాదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

అశ్వారావుపేటరూరల్: అంగవాడీ కేంద్రాలకు తక్షణమే కంది పప్పును సరఫరా చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరుతూ మంగళవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద సమస్యలు, డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సూపర్‌వైజర్ విజయలక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడారు. కార్యక్రమంలో కట్టా రాధా, మణి, నాగమణి, రాజేశ్వరి, లక్ష్మి ఉన్నారు.

మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతాం



తెగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న విప్ రేగా కాంతారావు

గుండాల: ప్రభుత్వానికి నివేదించి దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు మరమ్మతులు చేయిస్తానని, అవసరమైన చోట కొత్త నిర్మాణాలు చేపడతామని తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు హామీ ఇచ్చారు. మంగళవారం పినపాక నియోజకవర్గం పరిధిలోని ఆళ్లపల్లి మండలం పరిధిలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షాలు కారణంగా దెబ్బతిన్న బీటీ రోడ్లను పరిశీలించి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు మరమ్మతు పనులు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా దెబ్బతిని నష్టపోయిన ఇళ్లను పరిశీలించారు. ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. పలు కుటుంబాలను పరామర్శించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



భద్రాచలంటౌన్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిపో మేనేజర్ రామారావు

భద్రాచలంటౌన్: టీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భంగా భద్రాచలం ఆర్టీసీ డిపో కార్మికులు సీఎం కేసీఆర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ల చిత్ర పటానికి మంగళవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రామారావు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో కార్మికులకు ఉద్యోగ భరోస ఉంటుందన్నారు. కార్మికుల పక్షపాతిగా ఉన్న సీఎం కేసీఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గౌతమి, సాహితీ, నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. మణుగూరు డిపో ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ టి.స్వామి మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు ఆర్టీసీ ఉద్యోగులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ కనకదుర్గ, హెడ్ కానిస్టేబుల్ పి వెంకటేశ్వర్లు, ఆర్టీసి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

భద్రాచలంఅర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భద్రాచలం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపి ఇతరుల మరణాలకు కారణం కావొద్దని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు, పెండింగ్ చలాన్లు, హెల్మెట్ ధారణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. యువత మద్యం తాగి వాహనాలు నడపవద్దని, తల్లిదండ్రులు కన్న కల్లలు వృథా చేయవద్దని కోరారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని అశ్వాపురం ఎస్సై సురేష్ వాహనదారులను హెచ్చరించారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మంగళవారం రాత్రి ఎస్సై సురేష్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. పలువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపడం వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, మరెందరో గాయాలపాలవుతున్నారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మణిపూర్ ఘటనపై ర్యాలీ



సామూహిక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

ములకలపల్లి: మణిపూర్ ఘటనకు నిరసగా పాస్టర్స్ ఫెలోషిప్ సంఘాల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని ప్రధానకూడలిలో మానవహారం నిర్మించి, సామూహికంగా ప్రార్థనలు చేశారు. పలువురు వక్తలు మాట్లాడారు. రాజుపేట కాలనీ నుంచి పోలీస్‌స్టేషన్ వరకూ ప్రదర్శన నిర్వహించి, తహసీల్దార్ శేష గిరిరావు, ఎస్సై సాయికిషోర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా ఆల్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జాన్ విల్సన్, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రేమ్ దాసు, ట్రైబల్ పాస్టర్స్ మిషన్ అధ్యక్షుడు ఎం.కాంతారావు, సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు నరాటి ప్రసాద్, ప్రముఖ రచయిత ఎండి.ఉస్మాన్‌ఖాక్, బీఆర్‌ఎస్ నాయకులు బిక్కుమళ్ల సుధాకర్, ములకలపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు, మండలంలోని పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలి..

చంద్రుగొండ: కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణోత్ సేవ్యానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కాంట్రాక్ట్ ఉద్యోగులతో మంగళవారం సమావేశమై మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి నూనావత్ రమేష్, మండల బాధ్యులు రవిందర్, పరమేష్, అప్పారావు, నిరోష, శ్రావణి, శ్రవణ్, కుమార్, సాంబశివరావు, బేబి పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాజలం మాట్లాడారు. తల్లిపాలే శ్రేయస్కరమని, ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమని అన్నారు. 6 నెలల వయసు వచ్చే వరకూ తల్లిపాలు పట్టించాలని. తల్లిపాలతోనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఎదుగుతుందని అమె అన్నారు. స్థానిక వైద్యాధికారి ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణీయులకు సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సుదీర్ఘకాలం పని చేసి ఉద్యోగ విరమణ చేస్తున్న సూపరింటెండెంట్ ఇంజనీర్ అల్లూరి వెంకటేశ్వరరెడ్డి, సేఫ్టీ ఆఫీస్ అటెండర్ ఎస్.పద్మావతిలను ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో జీఎం దుర్గం రామచందర్ చేతుల మీదుగా పుష్పగుచ్చాలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలతో సత్కరించారు. అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలి

బూర్గంపాడు: ఎడతెరిపి లేని వర్షాలు, వరదలతో పదిహేను రోజులుగా పనులు లేక పస్తులుంటున్న భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పేరాల శ్రీనివాసరావు కోరారు. మంగళవారం సారపాకలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాలు, వరదలు కొంతమేరా తగ్గిన ఇసుక అందుబాటులో లేకపోవటంతో నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తాపీ కార్మికులకు ఆర్థిక సాయమందించాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.